1St Happy Work Anniversary. Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 39 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 09 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 39 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 09 February 2026 PAGES : 8 PRICE : 3/-

## లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

అయోధ్య లడ్డూలకు ప్రత్యేక నెయ్యి వాడటమే కల్తీకి నిదర్శనం మఠాధిపతులు, ధార్మిక పెద్దలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలి. తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వివాదంపై ప్రతి హిందూ భక్తుడు ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. భక్తుల మనోభావాలను గౌరవించడమే నిజమైన ధర్మరక్షణ అని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, కోట్లాది మంది విశ్వాసాలతో ముడిపడిన అత్యంత సున్నితమైన విషయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షసాధింపుగా మార్చేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. తిరుమల లడ్డులో కల్తీ జరిగిందన్న అంశంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన విచారణలో, సీబీఐ సమర్పించిన నివేదిక వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందని మంత్రి గుర్తుచేశారు. “60 లక్షల లీటర్ల నెయ్యిలో ఒక్క చుక్క కూడా అసలైన నెయ్యి లేదని నివేదిక స్పష్టం చేసిన తర్వాత కూడా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గం. వారికి ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదు” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. “అయోధ్యకు పంపిన లడ్డూల కోసం ‘ప్రత్యేక నెయ్యి’ వాడామని వైసీపీ నేతలు చెప్పడమే, తిరుమలలో వాడే నెయ్యి నాణ్యమైనది కాదని వారికి ముందే తెలుసనడానికి నిదర్శనం” అని మనోహర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్, పలమనేరు నుంచి ప్రత్యేకంగా నెయ్యి తెప్పించి అయోధ్యకు లడ్డూలు పంపామని చెప్పడం ద్వారా, ఐదేళ్లుగా మిగిలిన లడ్డూల తయారీలో ప్రజలను ఎలా మోసం చేశారో వారే అంగీకరించినట్టయిందని ఆయన విమర్శించారు. -మిగతా 2లో

## ఇది ఒక భవనానికి పునాది కాదు...
# భవిష్యత్తుకు పునాది

- ▶అమరావతిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన
- ▶టెక్నాలజీలో భారత్ భవిష్యత్ నాయకత్వానికి ఇది పునాది అన్న లోకేశ్
- ▶సీఎం ముందుచూపు అద్భుతం అని కితాబు
- ▶ఇతరులు ఇంకా ఆలోచనల వద్దే ఉంటే, సీఎం ఆచరణలో పెడుతున్నారని వ్యాఖ్యలు



2

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన చేయడం కేవలం ఒక భవనానికి పునాది రాయి వేయడం కాదని, క్వాంటం టెక్నాలజీ రంగంలో భారతదేశ భవిష్యత్ నాయకత్వానికి ఇక్కడే పునాది వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శనివారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఇది సాధ్యమవుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

ఇది చారిత్రక ఘట్టం: సీఎం చంద్రబాబు
అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి

“ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారత దేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం” అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే -మిగతా 2లో



## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్... విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్
92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక -మిగతా 2లో

## పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించొద్దు రామ్మోహన్ నాయుడు

వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతోందన్న రామ్మోహన్ నాయుడు
కేంద్ర బడ్జెట్ లో ఏపీకి పెద్ద పీట వేశారని కితాబు



2

## “నామ్ నరేందర్... కామ్ సరెండర్”... ప్రధాని మోదీపై షర్మిల విమర్శనాస్త్రాలు

అమెరికాతో ప్రధాని మోదీ ఒప్పందంపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు
ఇది గ్రేట్ డీల్ కాదు, దేశానికి బ్లాక్ డీల్ అని వ్యాఖ్య
అమెరికా బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ
సున్నా సుంకాలతో స్వదేశీ పరిశ్రమలకు, రైతులకు తీవ్ర నష్టమని ఆందోళన
ఒప్పందం పూర్తి వివరాలను వెంటనే బయటపెట్టాలని డిమాండ్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ‘గ్రేట్ డీల్’ కాదని, భారతదేశానికి ఇదొక ‘బ్లాక్ డీల్’ అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు ‘నామ్ నరేందర్.. కామ్ సరెండర్’ (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని -మిగతా 2లో

## రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ కీలక వ్యాఖ్యలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 08)

తన రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలగేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇంతవరకు ఎవరినైనా పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదన్నారు.“ఆరెస్సెస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. రీజినల్, డివిజనల్ అధిపతులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. సాధారణంగా 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు తెలియజేశాను. కానీ.. యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి వైదొలగాలని ఎప్పుడు కోరినా.. సిద్ధంగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ విరమణ ఉండదు” అని భాగవత్ (వీశీష్ట్రుఅ దీష్ట్రుస్త్రుఫ్) చెప్పారు. చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకుల నుంచి సంఘ్ పని చేయించుకుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు.

అమెరికా విడుదల చేసిన భారత్ మ్యాప్‌లో పీవోకే!
వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం -మిగతా 2లో

## కులం అనేది పుట్టుకతో వచ్చే విషయం, ఎంపిక చేసుకునేది కాదు: నాగబాబు



- ●కులాలను కలపడమే జనసేన సిద్ధాంతమని నాగబాబు స్పష్టీకరణ
- ●అనకాపల్లి, వైజాగ్ సౌత్ సీట్ల కేటాయింపే ఇందుకు నిదర్శనమన్న ఎమ్మెల్సీ
- ●కాపులకు వైసీపీ చేసిన అన్యాయంపై ఆ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడరని ప్రశ్న
- ●అంబటిని ఐకాన్‌గా చూపడం వల్లే వైసీపీ నష్టపోయిందని విమర్శ
- ●పాత చింతకాయ పచ్చడి రాజకీయాలు చేస్తే 11 సీట్లు కూడా రావని హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు, వైసీపీ నేతలపై, ముఖ్యంగా ఆ పార్టీలోని కాపు నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా దక్కవని ఆయన హెచ్చరించారు. జనసేన సిద్ధాంతాలను వివరిస్తూనే, వైసీపీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ఆయన పలు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, “మన దేశంలో కులం అనేది ఒక సామాజిక వాస్తవికత. ఎవరు ఏ కులంలో పుడతారో, దాన్ని ఎప్పటికీ మార్చుకోలేం. కుల రహిత సమాజం అనేది ఒక ఉన్నతమైన ఆశయమే అయినా, రాజకీయాల్లో వాస్తవ పరిస్థితులను అంగీకరించాలి. అందుకే పవన్ కల్యాణ్ గారు ‘కులాలను కలిపే ఆలోచనా విధానాన్ని’ జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటిగా చేర్చారు. -మిగతా 2లో

### ఇది ఒక భవనానికి పునాది కాదు...

# భవిష్యత్తుకు పునాది

చరిత్ర పునరావృతం అవుతుంది : ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "కొన్నేళ్ల క్రితం ప్రపంచం సాఫ్ట్‌వేర్ సేవల గురించి ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు, ఒక దార్శనిక నాయకుడు 'హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ రాజధానిగా ఎందుకు మార్చకూడదు?' అని ధైర్యంగా ప్రశ్నించారు. ఆ ఒక్క ప్రశ్న చరిత్రను మార్చేసింది. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు భారత్‌కు వచ్చాయి, లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ఒక నగరం రూపురేఖలే కాకుండా ప్రపంచంలో భారతదేశ స్థాయినే మార్చేసిన ఐటీ విప్లవం మొదలైంది. ఆ దార్శనిక నాయకుడే మన ముఖ్యమంత్రి చంద్రబాబు" అని వివరించారు."ఈ రోజు, మరింత లోతైన సాంకేతికతలు, పెద్ద సవాళ్లు, గొప్ప అవకాశాలతో నిండిన కొత్త శకంలో, ఆయన మరో కీలక ప్రశ్న సంధించారు. 'భారత్ క్వాంటం విప్లవాన్ని అనుసరించడం కాదు, ఎందుకు నాయకత్వం వహించకూడదు?' అని అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానమే ఈ అమరావతి క్వాంటం వ్యాలీ" అని లోకేశ్ ఉద్ఘాటించారు.

సీఎం ముందుచూపు అమోఘం : ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, "ముఖ్యమంత్రి గారు ప్రొఫెసర్ కామకోటి గారితో సమావేశం తర్వాత నన్ను పిలిచి, క్వాంటం ఎకోసిస్టమ్‌ను సృష్టించాలని చెప్పారు. అప్పుడు నేను వెంటనే నా ఫోన్ తీసి, 'క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏమిటో ఒక పేజీలో వివరించండి' అని చాట్‌జీపీటీని అడిగాను. ఆ సమాధానం చూశాక, తర్వాతి తరం టెక్నాలజీ ఎక్కడ ఉందో అర్థం చేసుకోవడంలో మన సీఎం అంత ముందున్నారన్న విషయం అర్థమైంది. ఇతరులు క్వాంటం అంటే ఏమిటో ఇంకా చర్చిస్తుంటే, ఈ మిషన్‌కు భారతదేశం ఎలా నాయకత్వం వహించాలనే దానిపై మన ముఖ్యమంత్రి అప్పుడే ప్రణాళికలు రచిస్తున్నారు. అదే ఆయన నాయకత్వ పటిమ, ముందుచూపు" అని లోకేశ్ ప్రశంసించారు.

మాది బుల్లెట్ ట్రైన్ సర్కార్ : ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న రెండు ప్రధాన బలాల గురించి లోకేశ్ వివరిస్తూ, "మొదటిది, నిరూపితమైన ట్రాక్ రికార్డ్ ఉన్న చంద్రబాబు గారి నాయకత్వం. ఇక్కడికి వచ్చే పెట్టుబడిదారులు కేవలం వాగ్దానాలు వినరు, చరిత్ర సృష్టించడం చూస్తారు. రెండవది, పనులను పూర్తి చేయడంలో మాకున్న అసమానమైన వేగం. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 'డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' ఉంది" అని అన్నారు. ఈ వేగానికి రెండు ఉదాహరణలు ఇస్తూ, "దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అయిన 15 బిలియన్ డాలర్ల గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టును 12 నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చాం. కేవలం ఒక నెల ఆలస్యమైనా, 13 నెలల్లోనే పూర్తి చేసి చరిత్ర సృష్టించాం. మరో రాష్ట్రంలో దశాబ్దానికి పైగా నిలిచిపోయిన ఆర్సెల్ మిట్టల్ ప్రాజెక్టును కేవలం ఏడాది వ్యవధిలోనే ఏపీలో పూర్తి చేసి చూపించాం. ఇతర చోట్ల అసాధ్యం అనిపించింది ఇక్కడ వాస్తవరూపం దాల్చింది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ ఒకసారి కమిట్ అయితే, దార్శనికతకు వేగం తోడవుతుంది" అని వివరించారు. రాష్ట్రానికి వచ్చే ఏ ప్రాజెక్టునైనా తమ ఉమ్మడి ప్రాజెక్టుగా భావించి, అడ్డంకులు తొలగించి, అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## లడ్డూపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్న మంత్రి నాదెండ్ల

ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత దాడులుగా మలచాలని చూస్తున్నారని, సమాజం ఈ కుట్రను గమనించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన ఎల్లప్పుడూ హిందూ ధర్మాన్ని కాపాడటమే తప్ప, ఇతర మతాలను కించపరచడం కాదని ఆయన స్పష్టం చేశారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ చెప్పాల్సింది పోయి, ప్రెస్ మీట్లు పెట్టి ఎదురుదాడి చేయడం వారి పైశాచిక ఆనందానికి నిదర్శనమని అన్నారు.ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి, మఠాధిపతులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అభిప్రాయపడ్డారు.

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.

తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల

## మొదటిపేజీ తరువాయి

విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు.అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్... విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు

సమర్పించాలని అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు.ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## రిటైర్మెంట్‌పై ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ కీలక వ్యాఖ్యలు

ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు. దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్– అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నానని చెప్పారు. అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని 'ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని పేర్కొన్నారు. ప్రచారం చేయడం సంఘ్ పని కాదని, సంస్కారాలను పెంపొందించడమేనని తెలిపారు.

## "నామ్ నరేందర్... కామ్ సరెండర్"... ప్రధాని మోదీపై షర్మిల విమర్శనాస్త్రాలు

ఆందోళన వ్యక్తం చేశారు.అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు.

"మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు.

అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు.

75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించొద్దు: రామ్మోహన్ నాయుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 08)

కూటమి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను సాధించిందని వ్యాఖ్య

బడ్జెట్ లో ఏపీకి పెద్ద పీట వేశారని... రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ. 10,134 కోట్లు, అమరావతి కోసం రూ. 1,120 కోట్లు కేంద్ర బడ్జెట్ లో కేటాయించారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రం సాయంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను సాధించిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని... పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించవద్దని పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తోందని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతోందని అన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి, దేశ శ్రేయస్సే లక్ష్యంగా మోదీ ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశ ప్రజల భవిష్యత్తును నిర్దేశించే విధంగా, యువత ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. రాబోయే 20 ఏళ్ల పాటు 7 శాతం వృద్ధి రేటు కొనసాగేలా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను రూపొందించారని కితాబునిచ్చారు.

## కులం అనేది పుట్టుకతో వచ్చే విషయం, ఎంపిక చేసుకునేది కాదు: నాగబాబు

సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న కులాలు, అల్పసంఖ్యాక కులాలను ప్రోత్సహించి పెద్దన్న పాత్ర పోషించాలి," అని అన్నారు. ఇందుకు ఉదాహరణగా, 40 శాతం కాపు జనాభా ఉన్న అనకాపల్లి స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన కొనతాల రామకృష్ణకు కేటాయించామని, అక్కడ కాపులు, గౌరలు కలిసి పనిచేసి ఆ సీటును గెలిపించుకున్నారని గుర్తుచేశారు. అలాగే, విశాఖ సౌత్‌లో బీసీ యాదవ వర్గానికి చెందిన వంశీకృష్ణ యాదవ్‌కు టికెట్ ఇవ్వగా, రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల శాతంతో గెలిచారని, ఇది తమ సిద్ధాంత నిబద్ధతకు నిదర్శనమని నాగబాబు స్పష్టం చేశారు. వైసీపీ నేతలపై విమర్శలు గుప్పిస్తూ, "నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం వైసీపీ నేతలకు ఉంది. వారు నోరు విప్పితే అబద్ధాలు, బూతులు తప్ప మరేమీ రావు. తాగుబోతులు, తిరుగుబోతులు అంటూ కాపు కులాన్ని కించపరిచే అంబటి రాంబాబు వంటి వారిని, వంగవీటి రంగా గారి ఫొటో పక్కన పెట్టి కాపు కుల ఐకాన్‌గా చూపాలని చూశారు. మీ ఈ ఆలోచనే మిమ్మల్ని ముంచింది" అని దుయ్యబట్టారు.ఈ క్రమంలో వైసీపీ కాపు నేతలను ఉద్దేశించి నాగబాబు పలు ప్రశ్నలు లేవనెత్తారు. "గ్రేటర్ రాయలసీమలోని 6 జిల్లాల్లో 20 శాతం బలిజ, కాపులు ఉన్నా ఒక్క ఎంపీ సీటు, 74 అసెంబ్లీ సీట్లలో పర్చూరు తప్ప ఒక్క సీటూ ఎందుకు ఇవ్వలేదు? దీనిపై అంబటి, పేర్ని నాని వంటి వారు జగన్‌ను ఎప్పుడైనా ప్రశ్నించారా? తరతరాలుగా బలిజలు గెలుస్తున్న రాజంపేట ఎంపీ సీటును మిథున్ రెడ్డికి కట్టబెట్టినప్పుడు మీరెక్కడ ఉన్నారు?" అని నిలదీశారు. వంగవీటి రంగా గారిపై వైసీపీది కపట ప్రేమ అని, ఆయన కుమారుడు రాధాను పార్టీ నుంచి పంపించి, రంగా గారిని దూషించిన గౌతం రెడ్డికి పదవి కట్టబెట్టారని ఆరోపించారు. 'కాపు నేస్తం' పథకానికి వైఎస్సార్ పేరు పెట్టినప్పుడు, కాపు కులంలో పుట్టిన మహానుభావుల పేర్లు పెట్టాలని మీ నాయకుడిని ఎప్పుడైనా అడిగారా? అని ప్రశ్నించారు. "ఇది జెన్?జి తరం. మీరు ఇంకా రాజనాల కాలం నాటి కుల రాజకీయాలు చేస్తే, ఈ 11 సీట్లు కూడా మిగలవు. ఆలోచించుకోండి" అని నాగబాబు హితవు పలికారు.

# మహిళా విద్యతోనే దేశాభివృద్ధి
# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన
### ఘనంగా బిసి, ఎస్టి, ఎస్సీ, కాపుల
### పార్టీ రహిత మహిళా సదస్సు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)

మహిళా విద్యతోనే దేశాభివృద్ధి చెందుతుందని, మహిళకు నిజమైన స్వతంత్రం వస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన పేర్కొన్నారు. ఒంగోలులోని తాతా కళ్యాణమండపం నందు బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపుల పార్టీ రహిత మహిళా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు డిగ్రీ కాలేజీ లెక్చరర్ అవిశనేని వెంగన్న అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కీర్తన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ తమ బిడ్డలకు చక్కని విద్యను అందించి సమాజానికి మంచి పౌరులను. మహిళ విద్యతోనే కుటుంబాలు కూడా బాగుంటాయన్నారు. విద్యుత్ ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడటంతో పాటుగా, తల్లిదండ్రుల కోరికలను, తన సొంత కోరికలను కూడా తీర్చుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ సహకారంతో కుటీర పరిశ్రమల నిర్మించి మరి కొంతమంది మహిళలకు ఉపాధి చూపించవచ్చు అన్నారు. ఈపాటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు రూపొందించాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకురాలు పార్వతి నాయుడు, మరో నాయకురాలు అనుపమ నాయుడు, ఇస్రో శాస్త్రవేత్త, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు చందు సాంబశివరావు, పేస్ ఇంజనీరింగ్ కాలేజ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అయినాబత్తిని ఘనశ్యామ్, సంతనూతలపాడు మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, చీమకుర్తి మాజీ మున్సిపల్ ఛైర్మన్ క్షేత్రపు రాఘవ, మైనార్టీ నాయకురాలు రజియా బేగం, శ్రావణి వెంకటేశ్వర్లు, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
09.02.26 సోమవారం



# దేవునికి ఎవరు పాలకులు కాదు


## మనం ధర్మకర్తలం మాత్రమే

- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు, ఆలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తల మండలి కృషి చేయాలి
- వైసీపీ హయాంలో కాసుల కక్కుర్తితో
- తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారు
- వెంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించక తప్పదు
- మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 8)
వైసీపీ హయాంలో కాసుల కక్కుర్తితో తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి డిఎస్ బీవీ స్వామి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పోరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ దేవునికి ఎవరు పాలకులు కాదు, మనం ధర్మకర్తలం మాత్రమే. స్వామి వారి ఉత్సవాలు, కైంకర్యాలు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించాలి. (తరువాయి 4లో...)

# తెప్పోత్సవానికి వేలంపాటలు కరువు

- ఆశగా ఎదురు చూసిన భక్తులకు రెండో పర్యాయం నిరాశే
- గతేడాది తెప్పోత్సవానికి వచ్చిన నగదు ఎంతో తెలియదన్న
- ఆలయ ఈఓ నారాయణరెడ్డి
- ఈ ఏడాది కూడా లెక్కలు తనకు తెలియదన్న వైనం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 8)
పొదిలి పట్టణంలో మునుపెన్నడూ లేని విధంగా గతేడాది తెప్పోత్సవం తొలిసారిగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కానీ ఆ రోజు తెప్పోత్సవం పై పయనించే దాతల విషయం పై పట్టణంలో అప్పట్లో తీవ్ర చర్చ సాగింది. అయితే సమయం ఎక్కువగా లేకపోవడంతో పట్టణంలోని ప్రముఖులైన గునుపూడి బ్రదర్స్, భవాని బ్రదర్స్ ఆ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఆ సమయంలో ఎంత నగదు ఆలయానికి చెల్లించారో కూడా ఎవరికి తెలియకపోవడం శోచనీయం. మొదటి సారి పట్టణంలో నిర్వహించిన తెప్పోత్సవానికి భక్తులు చాలా మంది తెప్ప పై ఊరేగింపుగా వెళ్ళేందుకు చాలా మంది దాతలు తహతహలాడారు. కాని ఆ సమయంలో పరిస్థితులు అనుకూలించక ఎటువంటి వేలంపాటలు నిర్వహించకుండా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనల మేరకు గునుపూడి, భవాని కుటుంబాలకు అవకాశం కల్పించారు. తొలుత శాశ్వత ఉభయదాతలుగా ప్రకటించుకున్నప్పటికీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనలతో కేవలం గతేడాది కార్తీక మాసం రోజున నిర్వహించిన తెప్పోత్సవం రోజున మాత్రమే ఉభయదాతలుగా వ్యవహరిస్తారని ఆలయ అధికారులు, చైర్మన్ తెలిపారు. దీంతో ఆ సమయంలో తెప్పోత్సవానికి ఉభయ దాతలుగా ఉన్న వారు రూ.30 లక్షలు చెల్లించారనే ప్రచారం మాత్రం జోరుగా సాగింది. కాని నేటి వరకు అందుకు సంబంధించిన లెక్కలు ఆలయ కార్యనిర్వాహణ అధికారి దగ్గర కూడా లేకపోవడం విడ్డూరం. దీని పై పట్టణంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున చర్చ సాగింది. బహిరంగ వేలంపాటలు నిర్వహించినట్లైతే అధిక మొత్తంలో వేలంపాటలో తెప్పోత్సవ వేడుకలకు పాడుకునే వారని, తెప్పోత్సవానికి అయిన ఖర్చు పోను మిగిలిన సొమ్ము ఆలయ అభివృద్ధికి ఉపయోగపడతుందని భక్తులు చెబుతున్నారు. అయితే ఆ నాడు తెప్పోత్సవానికి ఎంత ఖర్చు అయ్యిందో, తెప్పోత్సవంలో పాల్గొన్న దాతలు ఎంత ఇచ్చారో వాటికి సంబంధించిన ఎటువంటి లెక్కలు తన వద్ద లేవని ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి వెలుగు ప్రతినిధికి తెలియజేశారు. మరో 13 రోజుల్లో జరిగే తెప్పోత్సం కు సంబంధించిన నగదు లెక్కలు కూడా తనకు తెలియవని (తరువాయి 4లో...)

# బాలల భవితకు బాటలు బాలోత్సవాలు

- అందరూ చదవాలి...చదువుతోనే అభివృద్ధి
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు
- 4000 మంది విద్యార్థులతో బాలల పండుగ
- అట్టహాసంగా జరిగిన బాలోత్సవాలు
- ఆకట్టుకున్న సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు
- అలరించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- ఏకకాలంలో ఎనిమిది వేదికలపై పలు ప్రదర్శనలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)
బాలల భవిష్యత్తు కోసం బాలోత్సవం పేరున పలు విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు నిర్వహించటం అభిలాషణీయమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు పివిఆర్ గ్రౌండ్స్‌లో ప్రకాశం బాలోత్సవాలు ఆదివారం విద్యార్థుల కోలాహలం నడుమ విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ చదువే అభివృద్ధికి మార్గమని అందరూ చదువుకోవాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా ప్రకాశం బాలోత్సవ కమిటీ ప్రతి ఏటా బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు ఆసక్తిగా బాలోత్సవాల్లో పాల్గొనడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు. ప్రకాశం బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు ఎవి రమణారెడ్డి మాట్లాడుతూ బాలోత్సవ కార్యక్రమాలను సందర్శించినందుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం రోజంతా కొనసాగిన బాలోత్సవాల కార్యక్రమాలను పలువురు ప్రముఖులు సందర్శించారు. బాలోత్సవాలు బాలల భవితకు బంగారు బాటలు వేస్తాయని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. (తరువాయి 4లో...)

# ఇక లడ్డు డ్రామాలు ఆపండి

- తిరుమలలో జంతు కొవ్వు లేదని సిట్ తేల్చింది
- స్వార్థ రాజకీయాల కోసం వెంకన్న స్వామిని లాగొద్దు
- హిందువుల మనోభావాలను దెబ్బతీయద్దు
- జగన్ పై విష ప్రచారాలు ఆపండి
- పవన్ కళ్యాణ్ చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారు
- కొత్తగా కమిటీలు ఎందుకు దండగ
- తిరుమల లడ్డు టిడిపి ప్రచారం పై బూచేపల్లి ఫైర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)
ఇకనైనా కలియుగ ఆరాధ్య దైవం వెంకటేశ్వర స్వామి లడ్డు కల్తీ పై తెలుగుదేశం పార్టీ నాయకులు డ్రామాలు ఆపాలని వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు.




# ఊరూరా ఉగ్ర జన్మదిన వేడుకలు

## అన్నదానం, పండ్లు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 8)
ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఊరూరా ఘనంగా నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పల్లెపల్లెలో ఉగ్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. కనిగిరిలోని కస్తూరిభా పాఠశాల విద్యార్థుల చేత కేక్ కటింగ్ చేయించి పాఠశాల విద్యార్థులకు వాటర్ ఫ్రిజ్ అందజేశారు. పట్టణంలోని చిరు వ్యాపారులకు టిఫిన్ బండి, తోపుడు బండ్లను, వ్యాపార గొడుగులను అందజేశారు. పామూరు టిడిపి నాయకులు, జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ (తరువాయి 4లో...)

# దేవునికి ఎవరు పాలకులు కాదు మనం ధర్మకర్తలం మాత్రమే

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు నూతన ఆలయ అభివృద్ధికి ధర్మకర్తల మండలి కృషి చేయాలి. వైసీపీ హయాంలో కాసుల కక్కుర్తితో తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. నెయ్యిలో కల్తీ జరిగిందని స్వయంగా నాటి టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి ఒప్పుకున్నారు. మరో వైపు జగన్ నిస్సిగ్గుగా కల్తీ జరగలేదని అబద్ధాలు మాట్లాడుతున్నారు. వెంకటేశ్వర స్వామితో పెట్టుకుంటే ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించక తప్పదని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# తెప్పోత్సవానికి వేలంపాటలు కరువు



ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణంలో మాత్రం చాలా మంది భక్తులు తెప్పోత్సవంలో దాతలుగా పాల్గొనాలని ఆశ పడుతున్నా ఆ అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తెప్పోత్సవ నిర్వహణకు సంబంధించి బహిరంగ వేలం పాటలు పెడితే అటు తెప్పోత్సవ నిర్వహణ, ఇటు ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడతుందని భక్తులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. మరి ఆ దిశగా ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే మరి...!

# ఇక లడ్డు డ్రామాలు ఆపండి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు దైవంగా పూజించే వెంకటేశ్వర స్వామిని చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. తిరుమల లడ్డు పై కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలపై ఆయన మండిపడ్డారు. తిరుమల లడ్డూలో జంతు కొవ్వు పదార్థాలు కలిసాయి అని అబద్ధాలు మాట్లాడుతూ చంద్రబాబు హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ల చంద్రబాబు లడ్డు డ్రామాకు తెరదించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేందుకు కూటమి నాయకులు తిరుమల లడ్డు పేరుతో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు తప్పులను అరికట్టాల్సిన పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు తొత్తుగా మారారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించలేదు అంటూ టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేశారని బూచేపల్లి ఆరోపించారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు బొట్ల రామారావు, రమణరెడ్డి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ ఆకుపాటి



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 8) ఇటీవల విడుదలైన గ్రూప్ 2 పరీక్షలో ఇంటెలిజెన్స్ ఎస్ఐ శిరసాల వెంకటేశ్వర్లు కుమార్తె, కొడుకులు రమ్యశ్రీ డిప్యూటీ తహసిల్దార్, సాయి సూర్య ఎక్సైంజి ఎస్ఐ గా ఉద్యోగాలు సాధించారు. ఇరువురు కొలువుదీరిన సందర్భంగా వల్లూరమ్మ దేవస్థానం నందు ఏర్పాటు చేసిన ముక్కుబడి, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని వారిరువురికి చిత్రపటం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉగ్ర పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 8) ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ వల్లూరమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అది ఒక డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెందుతుందని ఆయన అన్నారు ఆయనకు దేవుడు ఆశీస్సులు అందించాలని ఈ సందర్భంగా వల్లూరమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# బాలల భవితకు బాటలు బాలోత్సవాలు



బాలోత్సవం నిర్వహణ తీరు పై ఆమె నిర్వాహకులను ప్రశంసించారు. ఆనంద్ గ్రానైట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ ఆనంద్ ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. వేలాది మంది బాలబాలికలను ఒకే వేదికపై చేర్చి విద్యార్థుల ఆసక్తులను, వారిలో దాగి ఉన్న ప్రజ్ఞాపాటవాలను వెలికితీస్తున్న బృహత్తర కార్యక్రమం పట్ల శ్రీధర్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 4000 మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థినీ, విద్యార్థులు తమలో కోడీకృతమైన నైపుణ్యాన్ని కనపరిచేందుకు పోటీపడ్డారు. తొలుత టంగుటూరు మండల విద్యాశాఖ అధికారి టి బాలాజీ జాతీయ జెండాను ఆవిష్కరించగా, ప్రకాశం బాలోత్సవం జెండాను బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. వివిధ వేదికలపై ప్రదర్శించబడిన లఘునాటికలు, జానపద నృత్యాలు, ఏకపాత్రలు, కోలాటం, సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సాంస్కృతిక విభాగాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కథా రచన, రైమ్స్ చెప్పడం వంటి అకడమిక్ అంశాలలో కూడా విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తిని కనబరచడం చెప్పుకోదగిన విషయం. పెద్ద ఎత్తున జరిగిన ఈ బాలోత్సవాలలో 200 మంది యన్‌సిసి ఇతర వాలంటీర్లు, మరో వందమంది ఉపాధ్యాయులు నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాలలో బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు ఎవి రమణారెడ్డి, ప్రకాశం బాలోత్సవం అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ,అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువి రామరాజు, యూటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, బాలోత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కే సుబ్రహ్మణ్యం, కమిటీ నాయకులు ఎస్ రవి, షేక్ అబ్దుల్ హై, కిలారి వెంకటేశ్వర్లు, వై వెంకట్రావు, జి ఉమామహేశ్వరి, సిహెచ్ జయప్రకాష్, యు భాస్కర్, బి తిరుపతయ్య, డియల్ ప్రసాద్, జ్యోతి, ఆర్‌యన్ సురేష్, సిహెచ్ వినోద్, వి బాల కోటయ్య, దామా శ్రీనివాసులు, నల్లూరి వెంకటేశ్వరరావు, నాయుడు మల్యాద్రి, యన్ చిన్నస్వామి, కె లక్ష్మీనారాయణ, షేక్ ఖాజా హుస్సేన్, యన్‌టి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.






# ఊరూరా ఉగ్ర జన్మదిన వేడుకలు

ఆధ్వర్యంలో ఉగ్ర జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెలిగండ్ల, కనిగిరి, పామూరు, హనుమంతునిపాడు, సిఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లో కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో డిడిఎం శ్రీనివాసరెడ్డి, కేటిఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, అద్దంకి రంగబాబు, శ్రీనివాసులు, నాగిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

## నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ
## జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
## జిల్లా కలెక్టర్ పి రాజబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8) మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 9వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా కార్డన్ సెర్చ్




(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 8)

సరైన పత్రాలు లేని 44 మోటార్‌సైకిళ్లను 2 ఆటోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పి బి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు గంగవరం గ్రామంలోని పాముల కాలనీ ఏరియాలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది. ఈ సెర్చ్ లో దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, దర్శి సీఐ వై రామారావు సర్కిల్ పరిధిలోని తాళ్లూరు, కురిచేడు, దొనకొండ ఎస్ఐలు మల్లికార్జున, శివకుమార్, త్యాగరాజు, అలాగే 35 మంది పోలీసు సిబ్బందితో కలిసి జల్లెడ పట్టడం జరిగింది. ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ డివైస్ ద్వారా అనుమానితులను చెక్ చేసారు. ఈ తనిఖీల్లో భాగంగా ముఖ్యంగా గంజాయి గురించి, అలాగే మత్తు పదార్థాల గురించి తనిఖీలు చేయడం జరిగింది. పాముల కాలనీ ప్రాంతానికి సంబంధించిన అన్ని ఇళ్లలో తనిఖీలు చేపట్టి, సరైన డాక్యుమెంట్లు, నంబర్ ప్లేట్లు లేనటువంటి 44 బైకులు, 2 ఆటోలు గుర్తించి, ఆ వాహన యజమానులకు కొంతమందికి చలనాలు వేయటం, అలాగే రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు, శిక్షలు గురించి అవగాహన కల్పించడం కూడా జరిగింది. అనంతరం దర్శి డిఎస్పి బి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిఐ, ఎస్ఐలు, సిబ్బంది అందరూ కలిసి డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో స్థానిక ప్రజలందరినీ మమేకం చేసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీని కూడా నిర్వహించి, అనంతరం అక్కడి యువత, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు, గంజాయిని పారదులుదాం అంటూ ప్రతిజ్ఞ కూడా చేయించారు. గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం మొత్తం నష్టపోతుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలు, ఉపాధి వంటి సానుకూల మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.





## ప్రతి ఆదివారం హ్యాపీ సండే సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించే కళాకారులు

### మున్సిపల్ కమిషనర్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 8)

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలో హ్యాపీ సండే సంతోషం,సందడి మరియు ఆరోగ్యం ఆనందం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాపట్ల పట్టణం, 13వ వార్డు నందు రోటరీ కల్యాణ మండపం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే .సంతోషం సందడి మరియు ఆరోగ్యం, ఆనందం కార్యక్రమం నిర్వహించారు. హ్యాపీ సండే కార్యక్రమాన్ని పట్టణం లో ప్రతి ఆదివారం సాయంత్రం 6 గంటలకు పట్టణం లో వివిధ ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతుంది. బాల,బాలికల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయని రానున్న ఆదివారం రోజు సాంస్కృతి కార్యక్రమాల లో పాల్గొనదలచిన బాలబాలికలు ముందుగానే మున్సిపల్ కమిషనర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ రకాల కళారూపాలను ప్రదర్శించుకొనడానికి హ్యాపీ సండే కార్యక్రమం మంచి వేదిక అవుతుంది. ఇక్కడ ప్రదర్శించిన బాల బాలికలకు సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని దాని ద్వారా రాష్ట్రస్థాయిలో కూడా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేరుకుపల్లె చెందిన మోక్షత, భావ్యశ్రీ, శ్రీలక్ష్మి, సాయి దీక్షత బాలికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సాధిక్, పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ సండే కార్యక్రమంలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 8)

హ్యాపీ సండే, సంతోషం, సందడి, ఆరోగ్యం, ఆనందం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మహాభారత ఇతిహాసానికి చెందిన పాండవ ఉద్యోగ పర్వం నుండి ద్వారకాపూరి ఘట్టం నాట్య, నాటక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీకృష్ణుడు పడక సీనులో పాండవులకు ధర్మోపదేశం చేసే ఘట్టాన్ని కళాకారులు హృదయాన్ని తాకేలా వేదికపై ఆవిష్కరించారు. ఈ నాటకంలో శ్రీకృష్ణుడి పాత్రను సింగారావు అద్భుతంగా పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. దుర్యోధనుడి పాత్రలో రామిరెడ్డి తన నటనతో పాత్రకు న్యాయం చేశారు. అర్జునుడి పాత్రలో సుధాకర్ సౌమ్యమైన హావభావాలు, సంభాషణలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ధర్మం, నైతిక విలువలు, సత్యం పట్ల నిబద్ధత వంటి అంశాలను ప్రతిబింబించేలా ఈ ప్రదర్శన సాగింది. వేషధారణ, నేపథ్య సంగీతం, సంభాషణలు కార్యక్రమానికి మరింత వైభవం చేకూర్చాయి. హ్యాపీ సండే కార్యక్రమం ద్వారా ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం, సామాజిక ఐక్యత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.



# ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులుగా చంబళ్ళ అయ్యప్ప



### జిల్లా మహిళా అధ్యక్షురాలుగా లక్ష్మి
### నియామక పత్రం అందజేసిన నాయకులు
### పలువురి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)

ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులుగా చంబళ్ల అయ్యప్ప, మహిళా అధ్యక్షురాలుగా రుద్ర బోయిన లక్ష్మి ఎన్నికయ్యారు. ఒంగోలులోని ఏపీ ముదిరాజ్ మహాసభ నూతన జిల్లా కార్యాలయంలో ఎంపికకు సంబంధించిన నియామక పత్రాన్ని ఏపీ ముదిరాజ్ మహాసభ నాయకుల చేతుల మీదుగా అయ్యప్ప, లక్ష్మి ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి సంఘం జిల్లా గౌరవ ముఖ్య సలహాదారులు దాసు వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ముదిరాజ్ మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులుగా పనిచేసిన చంబళ్ల శ్రీనివాసరావు స్థానంలో ఆయన కుమారుడు అయ్యప్ప ఎంపిక కావటం శుభ పరిణామం అన్నారు. కేవలం కుర్చీ కోసం కాకుండా కులం కోసం, కులంలోని అట్టడుగు వర్గాల కోసం పనిచేయాలని సూచించారు. జిల్లా గౌరవ ఉపాధ్యక్షులు బుడిగి కొండయ్య మాట్లాడుతూ ఈపాటికి జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ లు బాగా వెనుకబడి ఉన్నారని, వారికి ప్రభుత్వపరంగా రావలసిన సంక్షేమ పథకాలు దక్కేలా అయ్యప్ప పనిచేయాలని, అందుకు జిల్లాలోని ముదిరాజ్ లు అందరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం నూతనంగా జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన అయ్యప్ప మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షులుగా ఎంపిక చేసిన సంఘం జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, అందుకు అందరి సహాయ సహకారాలు, సూచనలు కావాలని కోరారు. ముదిరాజులను బిసి డి నుండి ఏకీ మార్చాలని ఎప్పటి నుండో డిమాండ్ ఉందని, అలాగే ముదిరాజ్ కులంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం కోసం, చిన్న వ్యాపారులకు సబ్సిడీ రుణాలు దక్కేలా, అన్ని కుల సంఘాలను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దొప్ప సుబ్బయ్య, ఒంగోలు దగ్గర ఉపాధ్యక్షులు నక్కా భాను, నగర కార్యదర్శి గంటా శ్రీను, చంబళ్ల కోటిలింగం, వీరేపల్లి సుబ్బారావు, వీరేపల్లి శ్రీనివాసరావు, కొండలరావు, కన్నా శ్రీను, తాడి శ్రీనివాసరావు (టైలర్), తాడి శ్రీనివాసరావు(ఆర్టీసీ), మాకాని వెంకటేశ్వర్లు, తాడి కొండలు, ఏలూరి రామయ్య, ఏలూరు పూర్ణచంద్రరావు, బోలా మస్తాన్, తదితరులు అయ్యప్పను, పుష్పగుచ్చాలతో, శాలువాలతో అభినందించారు.



# పలకల క్వారీలో పడి యువకుడు మృతి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 8)**

మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీకి చెందిన ముగ్గురు స్నేహితులు సరదాగా మార్కాపురం మండలం రాయవరం పరిధిలో ఉన్న పలకల క్వారీలో సరదాగా ఈత కొట్టడానికి వెళ్ళారు. అందులో ఒక యువకుడు కాలుజారి నీటిలో గల్లంతైన సంఘటన ఆదివారం జరిగింది. దీంతో ఇద్దరు యువకులు భయపడి వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు, సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ సుబ్బారావు, గ్రామీణ, పట్టణ, పోలీసులు, గజ ఈతగాళ్ల ద్వారా మృతదేహాన్ని వెలికి తీశారు. సంఘటన పై రూరల్ ఎస్ఐ వి వేమన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు మార్కాపురం కలెక్టరేట్‌లో

# ప్రజా సమస్యలు పరిష్కార వేదిక

**జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 8)**

మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మార్కాపురం కలెక్టరేట్ లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మార్కాపురం జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తమ స్పష్టంగా రాసుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు ఇవ్వాలని ఆయన తెలియజేశారు.

# ఉత్సాహంగా మూడో రోజు క్విస్ ఫెస్ట్ అదే జోష్, అదే ఎనర్జీతో విద్యార్థులు

**అలరించిన రమ్యా బెహరా పాటలు**
**అదరహో అనిపించిన విద్యార్థుల నృత్యాలు**
**పూర్వ విద్యార్థుల సమ్మేళనంకి మంచి స్పందన**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో క్విస్ ఫెస్ట్ - 2026 ఘనంగా సాగుతోంది. నాలుగు రోజుల ఫెస్ట్ లో మూడో రోజు కూడా ఎంతో ఉత్సాహంగా సాగిందని క్విస్ విద్యాసంస్థ అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. మూడో రోజు అదే జోష్‌తో విద్యార్థులు ఆడిపాడారు. స్టూడెంట్స్ నృత్యాలు అందరినీ ఎంతగానో అలరించాయి. మరోవైపు టెక్ ఎక్స పో, ప్రాజెక్ట్ ఎక్స్ పోకి సైతం భారీ స్పందన లభించింది. ప్రాజెక్ట్ లను సందర్శించేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మూడో రోజు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ప్రముఖ సింగర్ రమ్య బెహర, బ్యాండ్ కన్సార్ట్ వారితో కలిసి సందడి చేశారు. ఆమె పాటలకు విద్యార్థులు ఆడిపాడారు. ఇక మూడో రోజు సైతం క్రీడాపోటీలు కొనసాగాయి. వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వచ్చిన టీమ్ లు పోటాపోటీగా తలపడ్డాయి.

**పూర్వ విద్యార్థుల సమ్మేళనం...**

పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కళాశాల ప్రాంగణంలోని రామానుజన్ సెమినార్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విస్ లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులు తమ







కళాశాలకు తిరిగివచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వేడుక చేసుకున్నారు. వారి స్మృతులను నెమరువేసుకున్నారు. కళాశాల ఎంతో అద్భుతంగా అభివృద్ధి చెందిందని తెలియజేశారు. ల్యాబ్ లు, ప్రాజెక్ట్ రూమ్ లను తిరిగి చూసి నేటి టెక్నాలజీకి తగ్గట్లుగా విద్యాబోధన జరుగుతుందని అన్నారు. క్విస్ కళాశాల పూర్వ విద్యార్థులుగా తాము ఎంతగానో గర్వపడుతున్నట్లు చెప్పుకొచ్చారు. అనంతరం శ్రీ గాయత్రి దేవి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదివి ఉన్న స్థానాల్లో ఉన్నవారిని చూసి ఎంతగానో గర్వపడుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఛైర్మన్ విజన్ తో ఇంకా ఎన్నో ఎన్నో కొత్త కొత్త కోర్సులు, నూతన విధానాలు ప్రవేశపెడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ కిశోర్ బాబు, డీన్ ప్లేస్ మెంట్స్ డాక్టర్ జగదీశ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జీఎల్ ఎన్, డీన్ ప్లానింగ్ డాక్టర్ చల్లారామ్, డైరెక్టర్ ప్లానింగ్ అంకబాబు, వివిధ విభాగాల హెచ్ వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ప్రాంగణంలోని రామానుజన్ సెమినార్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విస్ లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న విద్యార్థులు తమ కళాశాలకు తిరిగివచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వేడుక చేసుకున్నారు. వారి స్మృతులను నెమరువేసుకున్నారు. కళాశాల ఎంతో అద్భుతంగా అభివృద్ధి చెందిందని తెలియజేశారు. ల్యాబ్‌లు, ప్రాజెక్ట్ రూమ్ లను తిరిగి చూసి నేటి టెక్నాలజీకి తగ్గట్లుగా విద్యాబోధన జరుగుతుందని అన్నారు. క్విస్ కళాశాల పూర్వ విద్యార్థులుగా తాము ఎంతగానో గర్వపడుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ కిశోర్ బాబు, డీన్ ప్లేస్ మెంట్స్ డాక్టర్ జగదీశ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జీఎల్ ఎన్, డీన్ ప్లానింగ్ డాక్టర్ చల్లారామ్, డైరెక్టర్ ప్లానింగ్ అంకబాబు, వివిధ విభాగాల హెచ్ వోడీలు, డీన్ లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.





# తర్లుపాడు మండల సర్వసభ్య సమావేశం

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమీక్ష





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 8)**

తర్లుపాడు మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఉత్సాహంగా జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒంగోలు అన్నమ్మ, మండల పరిషత్ అధ్యక్షురాలు సూరెడ్డి భూలక్ష్మి సంయుక్త అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై తమ పరిధిలోని సమస్యలను, అభివృద్ధి పనులను సభ దృష్టికి తీసుకువచ్చారు.

**శాఖల వారీగా సమగ్ర సమీక్ష**

సమావేశం ప్రారంభంలో మండలంలోని విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ మరియు రెవెన్యూ శాఖలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామాలవారీగా పెండింగ్‌లో ఉన్న



పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎంపీడీఓ అన్నమ్మ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**కేతగుడిపి సర్పంచ్ ఆగ్రహం : అంగన్‌వాడీ భవనంపై నిరసన**

ఈ సమావేశంలో కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ మాట్లాడిన మాటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. తన పంచాయతీలో ఎదుర్కొంటున్న సమస్యల పై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్థలం కొరత "కేతగుడిపిలో అంగన్‌వాడీ పాఠశాల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని గతంలో అనేక సమావేశాల్లో విన్నవించుకున్నా ఫలితం శూన్యం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుస్థితిలో పాఠశాల ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ అంతా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయిందని, అపరిశుభ్రంగా తయారైందని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారులు ఉండే చోట ఇలాంటి పరిస్థితులు ఉండటం తగదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 8)

1980- 82 విద్యా సంవత్సరంలో కనిగిరి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఈ కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణకు పూర్వ విద్యార్థులు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, సుందర్ రాజా, కెవిఎన్ రాజు, పివిఎన్ మురళీధర్, అబ్దుల్ ఖాదర్, బివి నారాయణ, వసంత, భారతి, జయరామిరెడ్డి, గోపి కిషోర్, కొప్పోలు ప్రభాకర్, వి భక్తవత్సలంలు అసోసియేట్గా ఏర్పడి కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఈ కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్న పూర్వ అద్యాపకులు ఓబయ్య, జాకబ్లకు ఎదురేగి పూలమాలలతో స్వాగతించారు. అనంతరం వారిని సన్మానించారు. ఓబయ్య, జాకబ్లు, వారు పూర్వ విద్యార్థులందరికీ తమ జీవిత అనుభవాలను వివరించారు. తమ ఆశీస్సులు అందజేస్తూ తమకు జరిగిన సన్మానానికి ధన్యవాదాలు తెలిపారు.. అలాగే ఈ కళాశాలకు అప్పటి ప్రిన్సిపల్గా వ్యవహరించిన నవులూరి శ్రీనివాసరావు, జువాలజీ అధ్యాపకులుగా వ్యవహరించిన కృష్ణారావులు వయోభారంతో ఈ కార్యక్రమానికి రాలేని కారణంగా వారి సందేశాన్ని క్లుప్తంగా అందించారు. పూర్వ విద్యార్థులందరికీ తమ ఆశీస్సులు అందజేశారు. తమను స్వయంగా కలుసుకొని ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు పూర్వ విద్యార్థులను అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆటపాటలతో సందడిగా సాగింది. పూర్వ విద్యార్థులు తమ వయసులను మరచి డాన్సులు వేశారు. పాటలు పాడారు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని కళాశాల ఆవరణలో నిర్వహించేందుకు అనుమతులను ఇచ్చి సహకరించిన ప్రిన్సిపాల్ రమణారెడ్డి, హెడ్ మాస్టర్ సంజీవిని, పల్లా కోటిరత్నం, తమ సహకారాన్ని అందించారు. 150 మందికి పైగా ఈ కార్యక్రమానికి హాజరై గ్రూప్ ఫోటో దిగారు. చూడామణి అనే నృత్యకారిణి తన సాంప్రదాయ నృత్యంతో అలరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి తమ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భవిష్యత్తులోనూ తమ సహాయం కొనసాగుతుందని వారు ప్రకటించారు. వసంత వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.







## 13న ఉమ్మడి ప్రకాశం జిల్లాలో

# వైయస్ షర్మిల రెడ్డి పర్యటన

**పాకల, తుమ్మలచెరువు గ్రామాల్లో జరిగే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు**

**షర్మిలమ్మ పర్యటనను కాంగ్రెస్ శ్రేణులు జయప్రదం చేయాలి**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)

ఈ నెల 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి చేపట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా, మార్కాపురం జిల్లాలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఒంగోలులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా జిల్లా ముఖ్య నాయకులతో సన్నాహార సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కొండేపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండలం పాకల గ్రామంలోఉదయం 10 గంటలకు జరిగే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఒంగోలు, చీమకుర్తి మీదగా నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలోని, మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని తర్లపాడు మండలంలో గల తుమ్మలచెరువు గ్రామంలో సాయంత్రం 4 గంటలకు రచ్చబండ కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమం అనంతరం కడపకు బయలుదేరి వెళ్తారని సైదా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని షర్మిలమ్మ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కరువు కాలంలో, కష్టకాలంలో ప్రతి పేదవారికి అన్నం పెట్టే విధంగా ఆనాడు కాంగ్రెస్ పార్టీ మంచి ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం నిధులతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ఏర్పాటు చేసిందని, ఈ పథకం ద్వారా ఎంతోమంది పేదలకు ఉపాధి పొంది సంతోషంగా ఉన్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు అండగ ఉన్న ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి, ఒక కుట్రతో పేదవారి నుండి ఉపాధి హామీ పనిని తొలగించి పేద ప్రజలను పూర్తిగా సర్వనాశనం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుతంత్రం చేస్తుందని, షేక్ సైదా ఆవేదన వ్యక్తం చేశారు. అయోమయంలో ఉన్న ప్రజలకు అండగా ఉండేందుకు,మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని, గతంలో మాదిరిగా అమలు చేయాలని,షర్మిలమ్మ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న యాత్రకు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి సతీష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వరరావు, షేక్ రసూల్, కాకర్లపూడి వేణు, జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు మన్నం ప్రసన్నరాజు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు సుదర్శన రవి, జిల్లా బీసీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు నట్టే సుబ్బారావు, జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు షేక్ మహబూబ్ వలి, జిల్లా కంట్రోల్ బోర్డు సభ్యులు కృష్ణబాబు, జిల్లా బీసీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు ఈమని కోటేశ్వరరావు, ఎస్సీ నాయకులు పాలపర్తి శ్రీనివాసులు, జె పంగులూరు, మండల అధ్యక్షులు దాసరి తిరుమలబాబు, తదితరులు పాల్గొన్నారు.




# నేడు జిల్లా స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

**తహశీల్దార్ కార్యాలయాలలో యధావిధిగా పిజిఆర్ఎస్ నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 8)

సోమవారం జిల్లా కేంద్రం కలెక్టరేట్ లో నిర్వహించే (పిజిఆర్ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 6.30 గంటల వరకు రాష్ట్ర సచివాలయం నందు మంత్రులు, కార్యదర్శులతో జిడిపి వృద్ధి రేటు, ఆర్టిజిఎస్, పిపి ప్రాజెక్టుల పురోగతి, స్వర్ణాంధ్ర విజన్-2047, లా అండ్ ఆర్డర్ పై వర్చువల్ ద్వారా నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోని వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొనున్న సందర్భంగా జిల్లా కేంద్రం లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ప్రజలు దీని గమనించి ఎవ్వరు కూడా జిల్లా కేంద్రానికి సమస్యల అర్జీలతో రావద్దని తెలిపారు. మండల తహశీల్దార్లు కార్యాలయాలలో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని, మండలాల పరిధిలోని ప్రజలు సమస్యలను తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలను అందజేయువచ్చునని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# రథోత్సవానికి పోలీస్ బందోబస్తు ఏర్పాట్ల పై సీఐ పరిశీలన



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 8)

మండల కేంద్రమైనతర్లుపాడు లో 9వతేదీనిర్వహించనున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవ వేడుకల సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పై పొదిలి సీఐ రాజేష్ కుమార్ పోలీస్ స్టేషన్ను సందర్శించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవం శాంతియుతంగా, సజావుగా జరిగేందుకు అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎస్ఐ బి బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బందికి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, గుంపుల నియంత్రణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, ఆలయ పరిసరాల్లో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు సహకారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రథోత్సవ భద్రతా ఏర్పాట్ల కోసం మొత్తం 97 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు నియమించనున్నట్లు వెల్లడించారు.

# వంద మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)

ఒంగోలులోని త్రోవగుంట, ముక్తినూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు సైకిళ్లు పంపిణీ చేశారు. అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఈ సైకిళ్లను అందజేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపిస్తే వారి భవిష్యత్తును ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యాశాఖలో తీసుకువస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని బాగా చూసుకుంటే వాళ్ళు పెద్దవారు అయిన తర్వాత మిమ్మల్ని బాగా చూసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, బండారు మదన్,విద్యా కమిటి చైర్మెన్ టి చిరంజీవి, టీడీపి నాయకులు పాల్గొన్నారు.

# మహా మహిమాన్వితం చాలీసా పారాయణం

## చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 8)

తులసీ దాసు రచించిన హనుమాన్ చాలీసా చాలా ప్రభావితం మహిమాన్వితం అయినదని భక్తుల పాలిట కల్ప తరువు వంటిదని శని దోషాలను సైతం నివారించ గలిగే శక్తి హనుమాన్ చాలీసా పారాయణకు ఉన్నదని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పవిత్ర చైతన్య పాల్గొని విద్యార్థులకు నిత్య జీవితంలో ఉపకరించే కొన్ని విషయాల గురించి తెలియ చెప్పారు. ప్రతి ఒక్కరూ హనుమాన్ చాలీసాను తప్పక నేర్చుకోవాలని ఆంజనేయ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి బాల విహార్ శిక్షణా తరగతులను పర్యవేక్షించారు. విద్యార్థులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

# రాష్ట్రంలో 100 ప్రముఖ పర్యాటక బీచ్‌ల్లో పాకల బీచ్ ఒకటిగా అభివృద్ధి



## రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 8)

రాష్ట్రంలో 100 ప్రముఖ పర్యాటక బీచ్ ల్లో పాకల బీచ్ ఒకటిగా అభివృద్ధి చేయడం జరిగిందని, ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు పాకల బీచ్ ఫెస్టివల్ ను అద్భుతంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. సింగరాయకొండ మండలం, పాకల బీచ్ లో ఈ నెల 14, 15 తేదేల్లో జరగనున్న బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఆదివారం ఉదయం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీలతో కలసి ఏవీ ని విడుదల చేసిన అనంతరం బీచ్ లో పారిశుద్ధ్య పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో విశాఖపట్నం బీచ్ మాదిరిగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఆ బీచ్ లో వున్న విధంగా పారమిట్ వాల్, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అప్పటి జిల్లా కలెక్టర్ తో చర్చించి నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 100 ప్రముఖ పర్యాటక బీచ్ ల్లో పాకల బీచ్ ఒకటిగా అభివృద్ధి చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రాంతంగా పాకల బీచ్ ను కూడా గుర్తించి యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పాకల బీచ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రోమో గా వాడుకోవడం జరిగిందన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే పాకల బీచ్ ఫెస్టివల్ లో హెలికాప్టర్ రైడింగ్, బోట్ రైడింగ్, పారా రైడింగ్, బీచ్ వాలీ బాల్, బీచ్ కబడీ వంటి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్ వంటివి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ బీచ్ ను అభివృద్ధి చేసిన తర్వాత జిల్లాలోని అన్నీ ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడం జరుగుచున్నదన్నారు. గత నెల సంక్రాంతి సమయంలో రోజుకు సుమారు 10 వేల మంది వరకు ఈ పాకల బీచ్ కు రావడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ బీచ్లో బే వాచ్ టవర్ ను ఏర్పాటు చేసి వచ్చే సందర్శకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వలన ఈ సంవత్సరం ఒక్క మరణం కూడా సంభవించలేదని మంత్రి గుర్తు చేశారు. అత్యంత సురక్షిత బీచ్ గా పాకల బీచ్ ను అభివృద్ధి చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పాకల బీచ్ ప్రాముఖ్యత ను తెలియ చేసే కార్యక్రమాలను చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఒంగోలు శాసన సభ్యులు శ్రీ దామచర్ల జనార్ధన్ రావు గారిచే 9వ తేదీఒంగోలులో కర్టన్ రైజర్ ప్రోగ్రాం, అలాగే 10వ తేదిన సంభందిత శాసన సభ్యుల ఆధ్వర్యంలో కందుకూరు, కనిగిరి, పొదిలి లో 2కె రన్ నిర్వహించడం జరుగుతుందని మంత్రి వివరించారు. 14వ తేదీ ఉదయంన పాకల బీచ్ ఫెస్టివల్ ను ప్రారంభించు కోవడం జరుగుతుందన్నారు. పాకల బీచ్ ఫెస్టివల్ అద్భుతంగా నిర్వహించేలా అన్నీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా ప్రజలు కుటుంబ సమేతంగా ఈ బీచ్ ఫెస్టివల్ కు హాజరై సంతోషంగా గడపాలని ఈ సందర్భంగా మంత్రి ప్రజలను కోరారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ, ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే పాకల బేచ్ ఫెస్టివల్ సందర్భంగా కర్టన్ రైజర్గా రూపొందించిన వీడియో ప్రోమో ను ఈ రోజు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. పర్యాటక బీచ్‌గా పాకల బీచ్ ను మరింతగా అభివృద్ధి చేసేందుకు బీచ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. బీచ్ ను ఒకసారి అభివృద్ధి చేసి సదుపాయాలు కల్పిస్తే ప్రజలంతా బీచ్ ను సందర్శించి ఎంతో ఆనందంగా, సంతోషంగా గడుపుతారన్నారు. ఈ పాకల బీచ్ లోతు తక్కువతో సురక్షిత బీచ్ అని కలెక్టర్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాకల బీచ్ ఫెస్టివల్ లో సందర్శకులను అలరించే, ఉత్సాహ పరిచే అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, వాటర్, బీచ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా ప్రజలు ఈ బీచ్ ఫెస్టివల్ కు హాజరై సంతోషంగా గడపాలని కోరారు. ఏపి మారి టైమ్ బోర్డు చైర్మన్ శ్రీ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ నెల 14, 15న రెండు రోజుల పాటు నిర్వహించే పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా స్వచ్ఛ పాకల కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకుని వివిధ కళాశాల విద్యార్థులను భాగస్వాములు చేసి బీచ్ ను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎంత శుభ్రంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకాశం జిల్లా లో పర్యాటకంగా మంచి అనుకూలమైన బీచ్ పాకల బీచ్ అని అన్నారు. జిల్లా లోని అన్నీ వర్గాల ప్రజలు ఉత్సాహంగా ఈ పాకల బీచ్ ఫెస్టివల్ ల్లో పాల్గొనాలని ఆయన ప్రజలను కోరారు. ఏపి పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డా నూకసాని బాలాజీ మాట్లాడుతూ, భవిష్యత్ లో పాకల బీచ్ రాష్ట్రంలో అభివృద్ధి చెందిన మొదటి పది బీచ్ లో పాకల బీచ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పాకల బీచ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రచార వాహనాలను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, పర్యాటక శాఖ మేనేజర్ నాంచారయ్య, ఆర్‌డిఓ లక్ష్మీ ప్రసన్న, పాకల గ్రామ సర్పంచ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, తదతరులు పాల్గొన్నారు.







# ఉగ్రన్న పుట్టిన రోజు సందర్భంగా చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదానం

## ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 8)

ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి 53 వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక చిల్డ్రన్స్ హోమ్ నందు అనాధ పిల్లలకు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ఉగ్రన్న పనిచేస్తున్నారని, నియోజకవర్గానికి బయోగ్యాస్ ప్లాంటు, ఎంఎస్ఎంఈ పార్క్ రావడం లో ఆయన కృషి మరువలేనిదని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎన్ఆర్ఇజిసి నిధులతో సిసి రోడ్లు వేపిస్తున్నారని, నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికైన రైల్వే ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగించి శరవేగంగా నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైను కనిగిరి వరకు పూర్తి చేయడంలో ఉగ్రన్న కృషి దాగివుందని కొనియాడారు. భవిష్యత్తులో ఉగ్రన్న పశ్చిమ ప్రకాశం నుంచి మంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లింగం వెంకట మధుసూదన్‌రావు, కంటా కోటయ్య, గుత్తి మహేష్, జాజం మధు, వేముల జయరాములు, బండి రమేష్, బత్తుల సుబ్బారావు, దాసరి రమణయ్య, బొమ్మినేని రవి, పెద్దిశెట్టి గణేష్, పత్తి వెంకటేశ్వర్లు, దుర్గం శ్రీకాంత్, వేముల రమేష్, కేశవరాయి విష్ణు వర్ధన్, ఒంగోలు బాబు, పావులూరి సూరి, తియ్యపిండి కార్తీక్, గోసుల సురేంద్ర, కంపా పెంచలయ్య, గంజిగుంట్ల సుధాకర్, గంజిగుంట్ల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ పార్వతీ త్రిపురాంబ దేవి అమ్మవారికి ఘనంగా సారె సమర్పణ

## అమ్మవారికి సారె సమర్పిస్తున్న భ్రమరాంబ సేవాసమితి సభ్యులు



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 8)

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండల కేంద్రంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీ పార్వతి త్రిపురాంబ సమేత శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం నందు ఆదివారం నాడు శ్రీ పార్వతి త్రిపురంబాదేవికి అమ్మవారికి ప్రకాశం జిల్లా ఒంగోల్ భ్రమరాంబ సేవా సమితి, మార్కాపురం జిల్లా వైపాలెం గ్రామానికి చెందిన భ్రమరాంబ సేవా సమితి వారు సారే సమర్పించారు. మేళ తాళాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఉత్సవ మూర్తులతో అత్యంత వైభవవ్యతంగా సారే సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ధూపాటి విశ్వ నారాయణ శాస్త్రి వేదమంత్రోచరణల మేళ తాళాలతో సారే సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబా సమితి కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com